క్లుప్తంగా

ముంతాలమ్మకు వెండి ఘటం సమర్పణ


వెండి ఘటం

యలమంచిలి: గ్రామ దేవత మూలస్థానేశ్వరీ దేవి (ముంతాలమ్మ) అమ్మవారికి గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రీనివాస్ (వైజాగ్ బుజ్జి) కుటుంబ సభ్యులు సోమవారం సుమారు 900 గ్రాముల బరువున్న వెండి ఘటాన్ని సమర్పించుకున్నారు. ఘటాన్ని మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఘటానికి బుజ్జి, శిరీష, దంపతులు, కుమారుడు సాయి సాహిత్‌ల చే ఆలయ అర్చకుడు శ్రీను శాస్త్రోక్తంగా పూజలు చేయించి, అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బొల్లింపల్లి ప్రభాకర రావు, సభ్యులు తేతలి కిషోర్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.6.16 లక్షలు

పెనుగొండ: పెనుగొండ శివారు పెద్దింట్లమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.6,16,324 వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పుష్ప తెలిపారు. సోమవారం దేవదాయ శాఖాధికారుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్టు చెప్పారు. దేవస్థానం సిబ్బంది, స్థానిక పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారని తెలిపారు.

వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు


వెంకటేశ్వరునికి పూజ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: కొడమంచిలి వెంకటేశ్వర స్వామి తిరువార్షిక కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అధ్యాత్మిక గురువు మానేనపల్లి ఉమా రామలింగేశ్వర స్వామి ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలకంరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

పెనుగొండ: కల్వరీ గ్రాస్పెల్ హీలింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆచంటలో మూడు సంఘాల పరిధిలో 50 మంది పేదలకు సోమవారం దుస్తులు పంపిణీ చేసినట్లు సంస్థ అధ్యక్షుడు చదలవాడ పాల్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శాంతి పాల్, జోసఫ్‌కిషోర్, విత్తనాల తిమోతి, ప్రసాద్, బద్దిరెడ్డి దానియేల్, గుత్తుల రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖరరెడ్డి

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలో 35 ఆవులు, 120 గేదెలకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా పశు వైద్య సిబ్బంది సోమవారం టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఈ టీకాలు ప్రతి రోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు వేస్తున్నట్టు చెప్పారు. నేరేడుమిల్లి, పెనుమర్రు గ్రామాల్లో పశువులకు మంగళవారం టీకాలు వేస్తామని తెలిపారు.

చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కు అందిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలోని 87 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అత్యవసర సమయంలో వైద్య చేయించుకున్న పేదలకు సుమారు రూ.63 లక్షల చెక్కులను బాధితులకు అందించినట్టు మంత్రి పేర్కొన్నారు.

వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ సస్పెన్షన్

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక 26 వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ పి.కమల్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.రామచందర్ రెడ్డి తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం, బయోమెట్రిక్ హాజరు వేయడంలో సమయపాలన పాటించకపోవడంపై నోడల్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి, కమల్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్టు ఆయన తెలిపారు.

హామీల అమలుకు కుంటి సాకులు


పాలకొల్లు సెంట్రల్ : యువత పోరు పోస్టర్ విడుదల చేసిన ఇన్‌చార్జి గుడాల గోపి


పెనుగొండ : యువత పోరు పోస్టర్ విడుదల చేస్తున్న నరేష్‌రాజు, పార్టీ నాయకులు

- కూటమి పాలకుల నిర్వాకం
- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: అధికారంలోకి రావడానికి అనేక బూటకపు హామీలను ఇచ్చి, వాటిని అమలు చేయడానికి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ఆరోపించారు. సోమవారం ఆయన యువత పోరు కార్యక్రమ వాల్ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం పీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాలల నుంచి విద్యార్థులను పంపిచేస్తున్నాయని, దీంతో వారి చదువులు మధ్యలో ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేద మధ్యతరగతి విద్యార్థుల చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదనే సదుద్దేశంతో నాడు వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను జగన్‌మోహన్‌రెడ్డి కూడా కొనసాగించారని గుర్తుచేశారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఫీజు రీయింబర్స్ పట్ల చిన్నచూపు చూసి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని విమర్శించారు. పాలకొల్లు నియోజకవర్గంలో రూ. 475 కోట్లతో మెడికల్ కళాశాల తీసుకొస్తే నాడు ఎదో వంకతో కళాశాల ప్రాంగణం వద్దకు వెళ్లి రాద్ధాంతం చేసేవారని, నేడు కనీసం మెడికల్ కళాశాల వైపు కన్నెత్తి కూడా చూడడంలేదని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని లేదంటే నిరుద్యోగ భృతి కింద ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు, నేడా విషయమే ఎత్తడంలేదని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కర్ర జయసరిత, సనిశెట్టి లీలాభవన్నారాయణ, బండి రమేష్, గంగా పవన్, పీటర్సన్ చిన్ని, గేదెల నరసింహరావు, మామిడి బాబు, జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, రామంజుల చిన్నమదు, ఇరిమే రాజు, బి.దుర్గారావు, ఖండవల్లి వాసు, మామిడిశెట్టి చిట్టిబాబు, జ్యోతి, హైమావతి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మోసపూరిత పాలన


బుడితి సుమన్

నరసాపురం: రాష్ట్రంలో కూటమి సర్కార్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి, మోస పూరిత పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బుడితి సుమన్ పేర్కొన్నారు. ఎన్నికల హామీలను కూటమి సర్కార్ పూర్తిగా గాలికి వదిలేసిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పులు చేసిందని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు తప్పుడు ప్రచారం చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు తాజాగా సాక్షాత్తు అసెంబ్లీలో జగన్ సర్కార్ చేసిన అప్పు రూ.3.50లక్షల కోట్లు అని ప్రభుత్వం ప్రకటించడం చూస్తుంటే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం అప్పులు విషయంలో తాము అబద్ధపు ప్రచారం చేశామని స్వయంగా వారే ఒప్పుకున్న సంగతి ప్రజలు గమనించారని వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని, సూపర్‌సిక్స్ హామీలు అటకెక్కాయని, వచ్చే నెల నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తామని, ప్రైవేటు ఆసుపత్రుల అసోసియేషన్ ప్రకటించిందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి నేతల మోసాన్ని ప్రజలు గ్రహించారని అన్నారు.

యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

పెనుగొండ: విద్యార్థులు, యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్ రాజు విమర్శించారు. ఈ నెల 12న నిర్వహించనున్న యువత పోరు పోస్టర్‌ను ఆయన పోడూరు మండలం తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, మెడికల్ కాలేజీల ప్రైవేటు, నిరుద్యోగ భృతి సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. త్రైమాసిక ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనకు ఇవ్వాల్సి రూ.4600 కోట్లు బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు కర్రి నారాయణ రెడ్డి (వాసు), పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), సబ్బితి సుమంగళిలు, జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరీ సుభాషిణిలు, జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి రామలింగేశ్వరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గుబ్బల వీర బ్రహ్మం, జిల్లా కార్యదర్శి సుంకర నాగబాబు, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

200 రోజులు పని కల్పించాలి

పెనుగొండ: ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి ఈ నెల 12న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. సోమవారం దేవలో మంచినీటి చెరువు తవ్వకాలు నిర్వహిస్తున్న ఉపాధి కూలీల వద్దకు వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. కార్మికులకు రోజుకు రూ.300 ప్రభుత్వం ఇస్తుందని చెప్తున్నా, కూలి రూ.250 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పని కల్పించాలని, కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. పాలపర్తి నాగేశ్వరరావు, నేతలు ఇస్సాకు, నేతల పెద్దిరాజు, గోనపాటి బాలరాజు, పాలపర్తి రాంబాబు, సబితి మరియ మ్మ, రత్నమ్మ, బొక్క పోలేదు, నేతల మంగ వడలి మణిలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 11 మందికి ఉద్యోగాలు

వీరవాసరం: ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో వీరవాసరం ఎస్ఎంబీటీఏవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సుమారు 32 మంది పాల్గొనగా 11 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వలవల నరసింహారావు సోమవారంతెలిపారు. కొలువులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వద్దినీడి సత్యనారాయణ మాట్లాడుతూ మా కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు, ఆంగ్లంపై పట్టు కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించడం వలన విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

వీరవాసరం: రాయకుదురులో అగ్ని ప్రమాద బాధితులైన తోట రాంపండు కుటుంబానికి సోమవారం పాలకొల్లుకు చెందిన మండల రాంప్రసాద్ కేవెల్ శ్రీనివాస్, కూనపరెడ్డి లక్ష్మణ స్వామి, అధికారి శాలిం రెండు బస్తాల బియ్యం, బట్టలు, నిత్యావసర సరుకులు అందజేశారు. రాయకుదురు గ్రామానికి చెందిన నార్కెడమిల్లి ప్రవీణ్‌మిత్ర బృందం రూ.30,000 విలువగల మంచం, పరుపు, ఫ్యాన్లను అందజేశారు. వీరికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య సైకిల్ యాత్ర సోమవారం ఆచంట మండలం ఆచంట వేమవరం పెంట నుంచి ఆచంట వేమవరం జగనన్న కాలనీ, అనంతరం పెనుగొండలో కొనసాగింది. వేమవరం జగనన్న కాలనీలో తాగునీరు, రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ లేదని, తాగునీరు ఉప్పగా ఉంటుందని, రూ.20 ఖర్చు పెట్టి టిన్ను వాటర్ తాగుతున్నామని కాలనీ వాసులు సీపీఎం నాయకులు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో మూడు సెంట్లు భూమి ఇవ్వాలని, ప్రభుత్వ బడ్జెట్లలో కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ నీరు శుభ్రత లేని కారణంగా లబ్ధిదారులు తాగునీరు కొనుక్కొని తాగాల్సి పరిస్థితి ఏర్పడిందని వివరించారు. లబ్ధిదారులు ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు రుణం అందజేయాలని, పాత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్ర దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17న కలెక్టరేట్ వద్ద నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెనుగొండ రాజీవ్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. యాత్రలో సీపీఎం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, కేతా గోపాలన్, మామిడిశెట్టి రామాంజనేయులు, క్రాంతి బాబు, పి.మోహనరావు, తలుపురి బుల్లాబ్బాయి, సిర్రా నరసింహమూర్తి, గుత్తుల రంగారావు, బండి రంగారావు, కొండేటి సత్యనారాయణ, సిర్రా విఘ్నేశ్వరుడు, కుసుమే జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, దేవబత్తుల రాధాకృష్ణ, ఎస్ వెంకటేశ్వరావు, షేక్ పాదుషా, నీలాపు ఆదినారాయణ, కప్పల రత్నరాజు, గుర్రాల సత్యనారాయణ పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి


పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్ నీరజ

పాలకొల్లు సెంట్రల్: క్షయ వ్యాధి అనేది నోటి తుంపర్ల ద్వారా గాలి ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుందని రాష్ట్ర టీబీ ముక్త్ భారత్ కన్సల్టెంట్ డాక్టర్ టి.నీరజ అన్నారు. సోమవారం మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. టీబీ బాధితులు ఎక్కడబడితే అక్కడ దగ్గడం, ఉమ్మడం వల్ల ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా క్షయ సోకుతుందన్నారు. వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏడాదికి ఒకసారి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయను అదుపు చేయుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ సిస్టం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు అద్దాల ప్రతాప్‌కుమార్, ఎం నవ్యజీవన్, స్టేట్ మైక్రో బయాలజిస్ట్ కె.సందప్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పి.ఎలిజిబెత్, పీవీ స్వామి, రమేష్‌బాబు, ఎస్‌కే అమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని

- మండల పరిషత్ సమావేశంలో తీర్మానం

వీరవాసరం: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సాగునీరు, తాగునీరు ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ సమావేశంలో తీర్మానించారు. వీరవాసరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. సమావేశంలో టీడీపీ, జనసేన ఎంపీటీసీల మధ్య విభేదాలు బట్టబయలయ్యాయి. నిధుల కేటాయింపు విషయంలో పక్షపాతం చూపుతున్నారని ఈ సందర్భంగా పలువురు సభ్యులు నిలదీయడం చర్చనీయాంశమైంది. మండలంలోని మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపాలని, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా పంట బోదెలు, కాలవలు ప్రక్షాళన, కార్యక్రమాలు నిర్వహించాలని పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఎంపీడీవో బిరుదుకోట అప్పారావు, తాహసిల్దార్ ఏవి రామాంజనేయులు, వైస్ ఎంపీపీ అద్దాల శ్రీరామచంద్రమూర్తి ,వీరవల్లి కుసుమ కుమారి, బోను జోష్నాదేవి, పంజా మంగతాయారు, గెడ్డం భారతి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు రెండు దరఖాస్తులు


కరకోడు పుంత రోడ్డులో ఖాళీ మద్యం సీసాలు

ఆకివీడు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని కరకోడు పుంత రోడ్డులో మందు బాబులు స్వైర విహారం చేసి మద్యం బాటిళ్లను ధ్వంసం చేసి తీవ్ర ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆ ప్రాంత రైతులు ప్రజా వేదికలో ఫిర్యాదు చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. రెండు ఫిర్యాదులు అందాయి. సిద్ధాపురం గ్రామానికి చెందిన అల్లూరి సోమరాజు కరకోడు ఆయకట్టు భూముల్లోకి వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, గాజు పెంకులు గుచ్చుకుని ఆసుపత్రుల పాలవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక నగర పంచాయతీలోని సర్వే నంబర్ 485లో నివాసం ఉంటున్నామని, ఆ ప్రాంతంలోని 45 మందికి పట్టాలు ఇచ్చారని, తనకు పట్టా ఇచ్చినా ఇల్లు కట్టుకునే స్థితిలో లేనందున ప్రభుత్వం ఇల్లు నిర్మించుకునేందుకు సహకరించాలని ఎ.సతీష్‌కుమార్ దరఖాస్తు చేసినట్లు ఎంపీడీఓ సుహాసిని చెప్పారు. రెండు దరఖాస్తులను ఆయా శాఖలకు పంపినట్లు తెలిపారు.

సీతా కోదండరామ విగ్రహ ప్రతిష్ఠాపన


ప్రతిష్ఠించిన సీతాసమేత కోదండ రామ విగ్రహాలు

పెనుమంత్ర: స్థానిక పెద్ద చెరువు గట్టున రూ.20 లక్షలతో నిర్మించిన ఆలయంలో సీతా కోదండ రామ, లక్ష్మణ, హనుమాన్, నూతన విగ్రహాలను సోమవారం పునఃప్రతిష్ఠించారు. గ్రామ శెట్టిబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రజా విరాళంతో ఆలయాన్ని పునర్నిర్మించినట్లు అభివృద్ధి కమిటీ సభ్యుడు వనుం దానయ్య తెలిపారు. నరాలశెట్టి గిరిమాధవి, కొప్పిశెట్టి వెంకన్నలీల దుర్గ దంపతులతో పాటు 9 మంది దంపతులు ఉదయం వాస్తు పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధనలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో పితాని వెంకట్, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్ గండి శ్రీనివాసరావు, గంటావాసు, ఎర్ర రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ కల్యాణం


కనకదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి యావని వేంకట రామచంద్ర సోమయాజులు (ఘనాపాటి) ఆచార్యత్వంలో దేవరకొండ భాస్కరశర్మ బ్రహ్మత్వంలో ఇరగవరం వేద పండితులచే ఎదురు సన్నాహ ఉత్సవం, అనంతరం అడపా పెదకాపు దంపతులచే స్వామివారి కల్యాణం చేశారు. భక్తులకు జాకెట్ ముక్కలు, కుంకుమ భరిణెలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమాల్లో కావలి శ్రీనివాసరావు, తులా రామలింగేశ్వరరావు, వీరా శ్రీనివాసరావు, రేలంగి నరసింహరావు పాల్గొన్నారు.

విజేతలకు స్పోర్ట్స్ షూ బహూకరణ


షూ అందిస్తున్న హెచ్‌ఎం మహ్మద్ లియాకత్ ఆలీ

యలమంచిలి: కాజ గ్రామంలోని పింగళి వెంకయ్య ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు నలుగురికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ లియాఖత్ ఆలీ, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు దంగేటి గోపాలకృష్ణలు కలిసి సోమవారం స్పోర్ట్స్ షూ బహూకరించారు. ఇటీవల శృంగవృక్షంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు చింతపల్లి శ్రీనివాస్ 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలో జరిగిన పరుగు పందెం పోటీల్లో శీలం సింధు, డి.మణినాగ, జె.రజితలు విజయం సాధించారని తెలిపారు. వీరిని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జక్కంరాజు అభినందించారు. పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు భాస్కర్ వ్యాయామ ఉపాధ్యాయుడు వినాయక్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే ఆదర్శనీయురాలు



సావిత్రీబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసాపురం: దేశంలో మహిళా విద్యకోసం అహర్నిశలు పనిచేసిన సావిత్రీబాయి పూలే ఆదర్శనీయురాలని జాతీయ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాస్ అన్నారు. సావిత్రీబాయిపూలే 128వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యయురాలు సావిత్రీబాయిపూలే సేవలను కొనియాడారు. సంఘం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యురాలు వాకా వరలక్ష్మి మాట్లాడుతూ బాలికలను విద్యావంతులుగా చేయడంలో సావిత్రీబాయిపూలే చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రేవు శ్రీనివాస్, సంఘ జిల్లా అధ్యక్షుడు సందక రామకృష్ణ, కొప్పాడ సత్యనారాయణ, కొట్టంగ నరేష్, సంగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల సెస్ బకాయిలు జమ చేయాలి

భీమవరం: జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్ బకాయిలు సుమారు రూ.3 కోట్లు విడుదల చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు పామర్తి రంగారావు, ప్రధాన కార్యదర్శి ఎండీ జుల్ఫిఖర్ ఆలీ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు, జుల్ఫిఖర్ ఆలీ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీలు ఆస్తి పన్ను నుంచి రూ.1కి ఎనిమిది పైసలు చొప్పున గ్రంథాలయ పన్ను వసూలు చేస్తున్న మొత్తాన్ని ఎప్పటికప్పుడు జిల్లా గ్రంథాలయ సంస్థల నిధులకు జమ చేయకపోవడంతో సిబ్బంది జీతాలు, పింఛన్లు చెల్లించే అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయాల నిర్వహణకు అవసరమయ్యే నిధులు లేక అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి గ్రంథాలయాలకు నిధులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

దివ్యాంగుడి చెంతకు జాయింట్ కలెక్టర్


దివ్యాంగుడి చెంతకు వచ్చి సమస్య తెలుసుకుంటున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశం చౌక్): చాలా రోజుల తరువాత ప్రారంభమైన పీజీఆర్ఎస్ కార్యక్రమంతో కలెక్టరేట్ హడావుడిగా ఉన్న సమయంలో దివ్యాంగుడు వీవీఎస్ వేణుగోపాల్ అర్జీ నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చి కారులోనే ఉండిపోయాడు. పరిస్థితిని అర్థం చేసుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆ దివ్యాంగుడి చెంతకు వెళ్లి అర్జీ స్వీకరించారు. ఆకివీడుకు చెందిన వీవీఎస్ వేణుగోపాల్ 2014లో యాక్సిడెంట్ అయ్యి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. దీంతో ప్రభుత్వం అందిస్తున్న రూ.6 వేల పెన్షన్ పొందుతున్నాడు. కుటుంబానికి నేనే ఆధారమని, ప్రభుత్వం అందజేస్తున్న రూ.6 వేలు నా వైద్యానికే సరిపోతున్నాయని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని, తనకు మెడికల్ డిపార్ట్‌మెంట్ ద్వారా మంజూరు చేసే రూ.15 వేల పెన్షన్‌కు పరిశీలించాలని జేసీకి విన్నవించాడు. దీనిపై జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి స్పందిస్తూ పింఛన్ పునఃపరిశీలన కారణంగా ఆన్‌లైన్ సైట్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేశారని, తిరిగి ప్రారంభించిన వెంటనే మీ అర్జీని పరిశీలిస్తానని అర్జీదారుడికి తెలిపారు.